సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం, 10, మే, 2024



కాంగ్రెస్ మీటింగ్‌లో తొక్కిసలాట

కాంగ్రెస్ కార్నర్ సమావేశంలో తొక్కిసలాట జరిగి ఓ మహిళ గాయపడగా.. మరో బాలిక కాలు విరిగింది. - 2లో



హరితహారానికి మొక్కలు సిద్ధం

జూన్ మాసంలో నిర్వహించే హరిత హారం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం అవుతున్నాయి. - 3లో

గరిష్ఠం/కనిష్ఠం 37°/27°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నారసింహుడికి నిత్యారాధనలు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయాన్ని వేకువజామున తెరిచిన అర్చకులు.. మేల్కొలుపులో భాగంగా శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు.అనంతరం నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అదే విధంగా ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

చేనేత నడ్డి విరిచిన కేంద్రం



మాట్లాడుతున్న కూరపాటి రమేశ్

భూదాన్‌పోచంపల్లి : మోదీ ప్రభుత్వం జీఎస్టీ విధించి చేనేత పరిశ్రమ నడ్డి విరిచిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ పేర్కొన్నారు. గురువారం చౌటుప్పల్ పట్టణంలోని చేనేత సహకార సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం జాతీయ చేనేత బోర్డు, ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్‌కార్డు, బున్‌కర్ యోజన పథకాలను రద్దు చేసిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా త్రిఫ్ట్ ఫండ్, యార్న్ సబ్సిడీ ఇవ్వడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభం కూరుకుపోయిందని వేదన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ లేక సుమారు రూ.200 కోట్ల విలువైన వస్త్ర నిల్వలు పేరుకుపోయాయన్నారు. అలాగే చేనేత సహకార సంఘాలకు ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేశాయని విమర్శించారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల డిజైన్లు డుప్లికేట్ అవుతున్నా అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. చేనేత పరిశ్రమను కాపాడుకోవడానికి త్వరలో భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోడె బాల్‌నర్సింహ, మంగళపల్లి శ్రీహరి, ఏలే భిక్షపతి, కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పిలాయిపల్లి, కప్రాయిపల్లిలో గురువారం స్థానిక, కేంద్ర పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి కోరారు. ఏమైనా సమస్యలు ఉన్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడినా పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.

రెండు రోజులే..!

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి రేపటితో తెర



భువనగిరి మున్సిపాలిటీ పరిధి రాయగిరిలో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో అభివాదం చేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, నాయకులు

- సభలు, సమావేశాలు, రోడ్‌షోలతో హోరెత్తిస్తున్న పార్టీలు
- జాతీయ స్థాయి నేతలతో సభల నిర్వహణ
- భువనగిరి సభలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- నేడు నకిరేకల్ సభకు హాజరుకానున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి రెండు రోజులే మిగిలింది. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగియనుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఇప్పటికే విస్తృత ప్రచారం చేపట్టారు. మిగిలిన ఈ రెండు రోజులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయడంతోపాటు పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ స్థాయి నేతల సభలతో ప్రచారం మరింత హోరెత్తిస్తున్నారు. గురువారం భువనగిరి సమీపంలోని రాయగిరిలో నిర్వహించిన సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొనగా.. శుక్రవారం నకిరేకల్‌లో నిర్వహించనున్న సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు.

వంద ఓటర్లకు ఒక బాధ్యుడు..

కాంగ్రెస్ పార్టీ వారం రోజుల నుంచే ఇంటింటి ప్రచారాన్ని కొనసాగిస్తోంది. ఇప్పుడు తాజాగా ప్రచార సరళిని మార్చింది. ప్రతి వంద ఓటర్లకు ఒక నాయకుడిని బాధ్యుడిగా పెట్టి, వారిని పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చే కార్యాచరణతో ముందుకు సాగుతోంది. బూత్‌ల వారీగా ఉదయం, సాయంత్రం వేళల్లో కాంగ్రెస్ శ్రేణులు ఆయా ఓటర్లను కలవడంతోపాటు ప్రచారం చేస్తున్నారు. వారిని సమన్వయం చేసేలా మండల నాయకులకు బాధ్యతలు అప్పగించింది. మరోవైపు నియోజకవర్గాల వారీగా అభ్యర్థితో కలిసి మంత్రులు, ఎమ్మెల్యేలు సభలు, రోడ్‌ షోలలో పాల్గొంటున్నారు.

- బీఆర్ఎస్ పార్టీ గడపగడపకు ప్రచారాన్ని చేపట్టింది. ఇప్పటికే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో పర్యటించారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి రెండు చోట్లా గెలుపు బాధ్యత తీసుకుని విస్తృత ప్రచారం చేస్తున్నారు.
- బీజేపీ మండలాల్లో ప్రచారం, సభలు నిర్వహిస్తోంది. ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నల్లగొండ, చౌటుప్పల్ సభల్లో పాల్గొన్నారు. కోదాడలో రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్, మిర్యాలగూడ కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొనగా, శుక్రవారం తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నమలై నల్లగొండ పార్లమెంట్ పరిధిలో పర్యటించబోతున్నారు.

పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఈవీఎంలు సిద్ధం

మరోవైపు 13వ తేదీన పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఈవీఎంల రెండో దశ పరిశీలనను పూర్తి చేసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు పంపించారు. అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తయింది. ఈ నెల 12వ తేదీన అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఈవీఎంలను తీసుకొని సంబంధిత అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు. గురువారం నల్లగొండలోని ఎన్జీ కాలేజీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ఈవీఎంలు, పోలింగ్ పరికరాల పంపిణీ ఏర్పాట్లను నల్లగొండ ఏఆర్ఓ, ఆర్డీఓ రవి పరిశీలించారు. ఎంత మంది సిబ్బంది వస్తున్నారు, వారికి సరిపడా ఎన్ని టెంట్లు వేయాలనే దానిపై సమీక్షించారు.

నేడు నకిరేకల్‌లో కాంగ్రెస్ సభ

నకిరేకల్ : కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం సాయంత్రం నకిరేకల్‌లో కాంగ్రెస్ ప్రచార బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతున్నారు. నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో సభ ఏర్పాటు పూర్తయ్యాయి. స్టేడియం అంతా భారీ లైటింగ్, సౌండ్ సిస్టమ్, బారీ కేడ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు సభా ఏర్పాట్లను పరిశీలించారు.



సిద్ధమవుతున్న సభా వేదిక

తూకం 'తప్పే'తోంది!



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు



20 కిలోల బాటు వేయగా 19.500 గ్రాములు చూపుతున్న ఎలక్ట్రానిక్ కాంటా

- కొనుగోలు కేంద్రాల్లో రైతులను ముంచుతున్న నిర్వాహకులు
- తూకం తక్కువగా చూపుతూ మోసం
- కోటమర్తి ఐకేపీ కేంద్రంలో వెలుగులోకి

అడ్డగూడూరు : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులను నిర్వాహకులు నిండా ముంచుతున్నారు. అదనంగా తూకం వేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. అడ్డగూడూరు మండలం కోటమర్తి కొనుగోలు కేంద్రంలో 40 కిలోల బస్తాకు కిలోన్నర ధాన్యం అదనంగా తూకం వేస్తుండగా రైతులు నిలదీశారు. వివరాలిలా.. కోటమర్తి గ్రామానికి చెందిన రైతు చిత్తలూరి పరశురాములు పది ఎకరాల్లో వరి సాగు చేశాడు. సుమారు 300 బస్తాల దిగుబడి రాగా నెల రోజుల క్రితం స్థానిక ఐకేపీ కేంద్రానికి తరలించాడు. బుధవారం కాంటా వేసిన నిర్వాహకులు.. 40 కిలోల బస్తా తూకం వేయగా కిలో 200 గ్రాములు తక్కువగా చూపింది. దీంతో బాధిత రైతుతో పాటు అక్కడే ఉన్న రైతులు కూనుకంటి శ్రీకాంత్, చెన్నబోయిన నాగరాజు, గునుగంటి శ్రీకాంత్, చెన్నబోయిన నాగరాజ్, కమ్మరి మత్తమ్మ, సురుగుల భిక్షం, సురుగుల బుజ్జమ్మ, వేముల మురళి, గునుగంటి విజయ్, అబ్బతి ఎల్లయ్య, షీల లింగయ్య, శీల ఎల్లయ్య అధికారులతో వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా వీవీకేలు డీసీఎం ఖర్చులని బస్తాకు ఐదు రూపాయల చొప్పున వసూలు చేశారు. హమాలీ ఖర్చుల నిమిత్తం 42 రూపాయలు వసూలు చేస్తూ హమాలీలకు రూ.25 మాత్రమే చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు.

తిరిగి కాంటా వేస్తాం : వెంకటేశ్వర్లు, ఏపీఎం

కోటమర్తి ఐకేపీ కేంద్రంలో ఎలక్ట్రానిక్ కాంటా మరమ్మతులకు గురైంది. 20 కిలోలు తూకం వేయగా తక్కువగా చూపుతుంది. తూకం వేసిన 300 బస్తాల ధాన్యాన్ని తిరిగి కాంటా వేస్తాం. ఆ తర్వాతే ధాన్యాన్ని ఎగుమతి చేస్తాం. కొత్త కాంటాను ఏర్పాటు చేస్తాం. అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలే



పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు వస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగు నెలల పాలనలోనే ప్రజలకు నలభై ఏళ్ల నరకాన్ని చూపించిన పాపం కాంగ్రెస్ పార్టీది అని ధ్వజమెత్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నామన్నారు. ప్రస్తుత పాలనలో తాము ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలు, గత ప్రభుత్వ పథకాలు ఆగిపోవడంతో పడుతున్న ఇబ్బందులు ప్రజలు చెప్పుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అభివృద్ధి , సంక్షేమం రెండు కళ్లుగా కోట్లాది రూపాయాలను ఖర్చు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. తెలంగాణలో వనరులు దోపిడీకి గురికాకుండా ఉండాలంటే పెద్ద దిక్కు బీఆర్ఎస్ అని ప్రజలు ఇప్పటికే గ్రహించారని అన్నారు. కాంగ్రెస్ అబద్ధపు వాగ్దానాలు నమ్మి ఒకసారి మోసపోయిన ప్రజలు మరోసారి నమ్మేందుకు సిద్ధంగా లేరని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ నెమ్మాది భిక్షం, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, మిర్యాల వెంకటేశ్వర్లు, మామిడి వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, దుర్గయ్య, నల్లపు శ్రీనివాస్, కోటిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

రాహుల్ వస్తే మహిళలకు 51 శాతం రిజర్వేషన్లు



నారీ న్యాయ్ సమ్మేళనానికి హాజరైన మహిళా నేతలతో సెల్ఫీ దిగుతున్న అల్కాలాంబ

- కాంగ్రెస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి
- ఆల్ ఇండియా మహిళా అధ్యక్షురాలు అల్కాలాంబ

భువనగిరిటౌన్: రాహుల్ గాంధీ ప్రధాని అయితే మహిళలకు 51 శాతం రిజర్వేషన్ కల్పిస్తారని, కాంగ్రెస్ పార్టీ విజయానికి మహిళా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ అన్నారు. గురువారం భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన నారీ న్యాయ్ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్ ధరలను నియంత్రించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో శాంతిభద్రతలు అదుపుతప్పాయన్నారు. కేంద్రంలోని బీజేపీ మహిళలపై వివక్ష చూపిస్తోందని విమర్శించారు. రాజకీయ, విద్యా వ్యవస్థలో మహిళలకు అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మహిళల సంక్షేమాన్ని కాంక్షిస్తూ మహాలక్ష్మి పథకం తెచ్చిందన్నారు. ఇప్పటికే ఉచిత బస్ ప్రయాణం, 500 గ్యాస్ సిలిండర్, గృహ లక్ష్మి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేసిందని, రూ.2,500 ఆర్థిక సహాయం పథకాలను అమలు చేబోతుందన్నారు. దేశంలో మహిళా సాధికారిత సాధనకే కాంగ్రెస్ నారీ న్యాయ్ సమ్మేళనం సదస్సులు చేపట్టిందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్‌లు మహిళల పట్ల వివక్షను, అణిచివేత విధానాలను అమలు చేశాయన్నారు. మహిళలపై దారుణాలు, కిడ్నాప్‌లు ఆ రెండు పార్టీల పాలనలోనే అధికంగా జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలు అధిక సంఖ్యలో కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు గెలుచుకోబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ తదితరులు పాల్గొన్నారు.

భీంరెడ్డి పోరాట చరిత్ర మరువలేనిది

సూర్యాపేట : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, ఎంసీపీఐ పొలిట్ బ్యూరో సభ్యుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి చేసిన పోరాట చరిత్ర మరువ లేనిదని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న అన్నారు. గురువారం భీంరెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. వేలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిన చరిత్ర ఆయనకే దక్కిందన్నారు. నేటి యువత బీఎన్ ని ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, నాయకులు మోరపాక ఉగ్రయ్య, లింగంపల్లి రాజు, ఓంకార్, బి.ఎల్లమ్మ, ఏపూరి సోమన్న, మీసాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే ముంపే..!

- భువనగిరిలో ప్రధాన రహదారి విస్తరణతో కష్టాలు
- వరద కాల్వల నిర్మాణంలో లోపాలు
- దుకాణాల్లోకి చేరుతున్న వర్షపు నీరు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం



ఇటీవల కురిసిన వర్షానికి జిల్లా కోర్టు ఆవరణలోకి చేరిన వరద నీరు

భువనగిరి : జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణతో ప్రజలకు కష్టాలు మరింత పెరిగాయి. వర్షాలు కురిస్తే రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు, కోర్టు ఆవరణలోకి వరద నీరు చేరుతోంది. దీంతో వ్యాపారులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వరద కాల్వ నిర్మాణంలో లోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు అంటున్నారు. 2022 ఆగస్టు 29న భువనగిరిలో కురిసిన కుండపోత వర్షానికి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా నుంచి వినాయక చౌరస్తా వరకు ప్రధాన రహదారి ఇరు పక్కలా ఉన్న షాపుల్లోకి వరద నీరు ప్రవేశించింది. దీంతో సుమారు రూ.60 నుంచి రూ.80 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఇంత నష్టం జరిగినా వరద నీరు వెళ్లేందుకు అధికారులు ప్రత్యామ్నా చర్యలు చేపట్టలేదు. తాజాగా ఈ నెల 5వ తేదీన భువనగిరిలో కురిసిన భారీ వర్షానికి భువనగిరి కోర్టు ఆవరణతో పాటు పలు దుకాణాల్లోకి వరద నీరు చేరింది. దీంతో దుకాణదారులు రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు.

వరద కాల్వల నిర్మాణంలో లోపం వల్లే..

ప్రధాన రహదారి దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు ఉన్నాయి. వీటితో పాటు కొత్తగా వందలాది నిర్మాణాలు వెలిశాయి. వీటిలో పలు భవనాల కింద సెల్లార్లను నిర్మించి వాటిలో దుకాణాలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి రోడ్డుకు ఇరుపక్కలా సెల్లార్ నిర్మాణాలకు అనుమతి లేదు. అయినప్పటికీ గతంలో నిర్మించుకున్న సెల్లార్‌తో పాటు తాజాగా నిర్మాణాలు జరిగాయి. ఇలా పట్టణంలో సుమారు 10 నుంచి 15 వరకు సెల్లార్లు ఉన్నాయి. ప్రస్తుతం సెల్లార్లలో ఉన్న దుకాణాలకు ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. గతంలో భువనగిరి పట్టణంలో ఎంత పెద్ద వర్షం పడినా దుకాణాల్లోకి వరద నీరు వెళ్లేదికాదు. మొదటిసారిగా 2022 ఆగస్టు 29 రాత్రి కుండపోత వర్షం కురువడంతో సెల్లార్లలోకి నీరు ప్రవేశించడంతో సామగ్రి మునిగిపోయింది. రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మించిన వరద, మురుగు కాల్వల నిర్మాణంలో లోపాల వల్లే ఇలా జరుగుతుందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అధికారులు కాల్వ లెవల్ మాత్రమే చూసుకున్నారు తప్పా.. రోడ్డుకు ఇరు పక్కలా ఉన్న భవనాలను దృష్టిలో పెట్టుకోలేదని వ్యాపారులు అంటున్నారు. ప్రధాన రహదారి నుంచి పట్టణంలోకి ఇతర మార్గాలకు వెళ్లే ప్రదేశంలో ఎత్తు పెంచడం వరద నీరు బయటకు వెళ్లకుండా రోడ్డు మీదే ఉండిపోతుంది. దీనికి తోడు వరద, మురుగు నీటి కోసం కొత్తగా నిర్మించిన కాల్వలోకి చేరకుండా రంధ్రాలు చిన్నవిగా ఉండడం మరో కారణంగా చెబుతున్నారు. దీంతో వరద నీరంతా రహదారి వెంట ప్రవహించి దుకాణాల్లోకి చేరుతుందని వాపోతున్నారు. వేసవిలోనే కురిసే వర్షాలకు ఇలా జరిగితే వర్షాకాలంలో పడే భారీ వర్షాలకు వరద నీరు దుకాణాల్లోకి ప్రవేశించే అవకాశం లేకపోలేదు.



దుకాణంలోకి వరద చేరడంతో నీట మునిగిన సామగ్రి (ఫైల్)

రోడ్డు విస్తరణ పనులు ఇలా..

భువనగిరిలో ప్రధాన రహదారిని సమీకృత మార్కెట్ సముదాయ భవనం నుంచి పాత బస్టాండ్ వరకు దాదాపు 2.15 కిలో మీటర్ల మేర రూ.15.18కోట్లతో విస్తరించారు. 2021లో దీపావళి రోజున పనులు ప్రారంభించారు. డిసెంబర్ 2022 నాటికి పూర్తి కావల్సి ఉంది. నిర్మాణ పనులు ప్రారంభం అయినప్పటి నుంచి వ్యాపారులు, ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఇప్పటి వరకు కూడా రోడ్డుకు ఇరువైపులా వరద కాల్వల పైపులైన్ల నిర్మాణం, పార్కింగ్, ఫుట్‌పాత్, రేలింగ్ పనులు పూర్తి కాలేదు.

వర్షపు నీరు సాఫీగా వెళ్లడం లేదు



"భారీ వర్షాలు వచ్చినప్పుడు పట్టణంలోని ప్రధాన రహదారిపై వరద నీరు, మురుగు నీరు నిలుస్తోంది. నూతనంగా నిర్మించిన డ్రెయినేజీలోకి వరద నీరు వెళ్లేలా ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ చిన్నగా ఉంటాయి. పెద్ద ఎత్తున వరద వచ్చినప్పుడు ఈ రంధ్రాల్లో చెత్త చేరి మూసుకుపోతున్నాయి. దీంతో వరద నీరు రోడ్డుపై నిలిచి దుకాణాల్లోకి చేరుతోంది.

–అనిల్, వ్యాపారి, భువనగిరి

బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం

- బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, చిత్రంలో సునీత, భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట : తెలంగాణాలో 17 పార్లమెంట్ స్థానాల్లో 6 సీట్లను బడుగు, బలహీన వర్గాలకు కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేషం పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్డు షో, కార్నర్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్యగౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 80 లక్షల మంది ఉన్న మాదిగలకు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. గ్యారంటీల పేరుతో వచ్చే నాయకులను ప్రజలు నిలదీయాలని కోరారు. గతంలో భువనగిరి ఎంపీలుగా పనిచేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యాదగిరిగుట్టను పట్టించుకోలేదన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానాన్ని ప్రపంచ స్థాయి క్షేత్రంగా పునర్నిర్మాణం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతున్నారు. రైతుల కోసం ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను కేసీఆర్ తీసుకువచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందారని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దేవుడు చుట్టూ తిరిగినా, ఇంకేమి చేసినా మంత్రి పదవి మాత్రం రాదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని, కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాదిరిగా ఢిల్లీలో సేవ చేసుకుంటూ తిరిగేవాడిని కాదన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సూధగాని హరిశంకర్‌గౌడ్, ఎన్నికల సమన్వయ కర్త గుజ్జ యుగేందర్‌రావు, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటంరాజు, మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, కౌన్సిలర్లు దండెబోయిన అనిల్‌యాదవ్, అవుల మమత సాయి యాదవ్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ బాబా, నాయకులు మిట్ట వెంకటయ్య, వంటేరు సురేష్‌రెడ్డి, సతీష్‌రాజు, ముక్కెర్ల సతీష్, కోల వెంకటేష్, ఆకుల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

రెండు ఎన్నికలకు ఒక్కరే రిటర్నింగ్ అధికారి !


నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం, ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఇలా రెండు ఎన్నికలకు ఒక్కరే రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించడం చాలా అరుదు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కాగా.. ఎన్నికల సంఘం నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గానికి జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనను రిటర్నింగ్ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆమె నామినేషన్లు స్వీకరించారు. ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఈ నెల 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల కాగా.. ఉమ్మడి జిల్లాల పరిధిలో నల్లగొండ నుంచే నామినేషన్లు స్వీకరించాల్సి ఉన్నందున మళ్లీ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందననే రిటర్నింగ్ అధికారిగా ఎన్నికల సంఘం నియమించింది. ఇటు లోక్‌సభ, అటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఆమే వ్యవహరిస్తూ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం

- నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన

నల్లగొండ: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6గంటల వరకు రాజకీయ పరమైన బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం ఉంటుందని నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచారాలకు సంబంధించిన ఎస్ఎంఎస్‌లు పంపకూడదని అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఎస్ఎంఎస్‌లు పంపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఒక్క ఎస్ఎంఎస్‌తో పోలింగ్ బూత్ వివరాలు



ఓటరు ఫోన్‌కు వచ్చిన వివరాలు

భువనగిరిటౌన్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. ఓటరు స్లిప్పులు అందని వారు తమ సెల్‌ఫోన్ నుంచి ECI స్పేస్ ఓటరుకార్డు నంబర్(ఉదా. ECI <space> WCN5226756) టైప్ చేసి 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపితే పోలింగ్ బూత్ నంబర్‌తో పాటు ఓటరు లిస్టులోని క్రమ సంఖ్య వివరాలు ఫోన్‌కు మెసేజ్ వచ్చేలా ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లు చేసింది.

వాహనాల తనిఖీల్లో రూ.18,85,000 స్వాధీనం

నార్కట్‌పల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పలువురు వాహనదారుల నుంచి పోలీసులు రూ.18,85,000 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో జిల్లా ట్రెజరీకి తరలించినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

ఆత్మకూరు(ఎం)లో..

ఆత్మకూరు(ఎం): ఎలాంటి ఆధారాలు లేకుండా ఓ వ్యక్తి రూ.1,23,800 నగదు తీసుకెళ్తుండగా పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని పుల్లాయిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన బత్తిని ప్రవీణ్ బైక్‌పై భువనగిరి నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మండల కేంద్రంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అతడి వద్ద పరిమితికి మించి నగదు ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దొమ్మేటి నాగరాజు తెలిపారు.

విజయ సంకల్పంతో సాగాలి



మాట్లాడుతున్న అమిత్‌షా, కమలం గుర్తును చూపిస్తున్న ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



జన సభకు హాజరైన పార్టీ కార్యకర్తలు, ప్రజలు

- మోదీని మూడోసారి ప్రధానిగా గెలిపించుకోవాలి
- పోచంపల్లిలో టెక్స్‌టైల్ పార్కు, బీబీనగర్‌లో ఎయిమ్స్ మా హయాంలోనే
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- జై శ్రీరాం నినాదంతో ప్రసంగం ప్రారంభం
- యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, కొమురవెల్లి మల్లన్నకు నమస్కారం

సాక్షి, యాదాద్రి, భువనగిరి: భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయిగిరిలో గురువారం నిర్వహించిన సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన ప్రసంగంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ నిర్వహించిన ఈ సభకు పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. అమిత్‌షా ప్రసంగిస్తున్న సేపు బీజేపీ శ్రేణులు నినాదాలతో హోరెత్తించారు. తన ప్రసగంలో శ్రీ యాదగిరి లక్ష్మీనర్సింహ స్వామి, కొలను పాక జైన్ మందిర్, సోమేశ్వరాలయం, కొమురవెల్లి మల్లన్న దేవతలకు అమిత్‌షా ముందుగా నమస్కరించారు. మోదీని మూడోసారి ప్రధానిగా గెలిపించుకోవాలని, అందుకు భువనగిరిలో బూరనర్సయ్యను గెలిపించాలని కోరారు. ఇందుకోసం విజయం సంకల్పంతో పిడికిలి బిగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ టెక్స్‌టైల్ రంగంలో ఉపాధి అవకాశాలు పెంచడానికి విప్లవాత్మక మార్పులు తెచ్చారని, పోచంపల్లిలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేశామన్నారు. బీబీనగర్‌లో రూ.1400 కోట్లతో ఎయిమ్స్ ఏర్పాటు చేశామన్నారు. భువనగిరి–జనగామ మధ్య రైల్వే ట్రాక్ ఆధునీకరణ పనులు, రాయిగిరి నుంచి వరంగల్ వరకు నాలుగు లేన్ల జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేశామన్నారు. కొమురవెల్లిలో ఆధునిక రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశామని, సూర్యాపేట వయా జనగామ సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

అమిత్‌షాకు సన్మానం

సభ ప్రాంగణం కాషాయమయంగా మారింది. అమిత్‌షా హెలికాప్టర్‌లో సూర్యవంశీ స్పిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ ప్రదేశానికి మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో సభ వేదిక వద్దకు 12.25 గంటలకు చేరుకున్నారు. అమిత్ షాకు ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ ఇతర నాయకులతో కలిసి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. బీజేపీ భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, పార్లమెంటరీ ప్రభారీ పాపారావు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, సంకినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, పడాల శ్రీనివాస్, దాసరి మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్ గుప్తా, శివకుమార్, అశోక్, ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, అసెంబ్లీ నియోకవర్గాల కన్వీనర్లు, మండల, మున్సిపాలిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

రాహుల్ ప్రధాని అయ్యేది లేదు..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు అయ్యేది లేదు.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేది లేదని బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల గుండెల్లో మోదీ ఉన్నట్లు చెప్పారు. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అన్నట్లు.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీరు ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదన్నారు. రాజ్యాంగం గానీ, రిజర్వేషన్లు గానీ రద్దుకావని, రాహుల్ గాంధీ రాజకీయ భవిష్యత్ రద్దవుతుందన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే భువనగిరిలో ఇండస్ట్రీయల్ పార్కుతో పాటు ఐటీ హబ్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. రాచకొండ గుట్టలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. సినిమా డైలాగులతో ఆయన యువతలో ఉత్సాహం నింపారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకటరావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

భానుపురి (సూర్యాపేట): ఎలక్షన్ విధులు కేటాయించిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు శుక్రవారం చివరి అవకాశమని, ప్రతిఒక్కరూ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకటరావు అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, బీఎస్ లతతో కలిసి గురువారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాలో 9357 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా.. ఇప్పటివరకు 7934 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. ఎక్కువగా పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయలేదన్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఏఆర్వోలు ఉద్యోగులకు ఫోన్ చేసి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోని వారు 13న జరిగే పోలింగ్‌లో పాల్గొనలేరని పేర్కొన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అన్ని నియోజకవర్గాల్లో మోడల్, ఉమెన్ పోలింగ్ బూత్‌ల కోసం చేస్తున్న ఏర్పాట్లను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ రూపేందర్ సింగ్, ఏఆర్వోలు, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌లో తొక్కిసలాట



కాలు విరిగిన బాలిక



గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కార్యకర్తలు

- మహిళ, బాలికకు గాయాలు

గుండాల: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో తొక్కిసలాట జరిగి ఓ మహిళ గాయపడగా.. బాణసంచా పేలుళ్లకు భయపడి ఓ బాలిక పరుగెడుతూ కిందపడడంతో కాలు విరిగింది. కార్నర్ సమావేశంలో కార్యకర్తలు, మహిళలు సమావేశం ముగిసిన అనంతరం ఒకరినొకరు తోసుకోవడంతో వస్తాకొండూర్ గ్రామానికి చెందిన వంగాల అనిత కింద పడటంతో తొంటికి దెబ్బ తగిలింది. బాధితురాలిపై కొంత మంది పడటంతో ఆమె మరింత విల విలలాడారు. గమనించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బాధిత మహిళను కార్యకర్తల సహాయంతో ప్రైవేట్ వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అంతకుముందు యువజన కాంగ్రెస్ నాయకులు బాణసంచా పేల్చడంతో గుండాల మండల కేంద్రానికి చెందిన బాలిక గిరికత్తుల సాత్విక భయంతో రోడ్డు అవతలికి పరుగెడుతూ సీసీ రోడ్డు మీద పడటంతో కాలు విరిగింది. బాలిక తల్లిదండ్రులు, పార్టీ కార్యకర్తలు హుటాహుటిన ప్రైవేట్ వైద్యుని వద్దకు తీసుకెళ్లి విరిగిన కాలుకు కట్టు కట్టించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

'పట్టభద్రుల' పరిశీలకుడిగా రాహుల్ బొజ్జా



రాహుల్ బొజ్జాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పరిశీలకుడిగా ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జాను ఎన్నికల సంఘం నియమించింది. గురువారం ఆయన నామినేషన్ల పరిశీలనకు గాను నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన ఆయనకు మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఉపఎన్నిక పూర్తయ్యే వరకు రాహుల్ బొజ్జా 9866377107 నంబర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రిక్షా తొక్కుకుంటూ వచ్చి నామినేషన్ దాఖలు



నామినేషన్ వేసేందుకు రిక్షా తొక్కుకుంటూ కలెక్టరేట్‌కు వస్తున్న పూసల శ్రీనివాస్

నల్లగొండ: ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. చివరి రోజు శివసేన బలపరిచిన తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ సమితి పార్టీ అభ్యర్థి పూసల శ్రీనివాస్ నామినేషన్ సమర్పించేందుకు రిక్షా తొక్కుకుంటూ కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిరుద్యోగులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా ఆగస్టు లోగా సీఎం రేవంత్‌రెడ్డి 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకపోతే పోరాటం చేస్తామన్నారు. నిరుద్యోగుల గొంతుకగా ఉండేందుకు ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆయన గతంలోనూ పలుసార్లు అసెంబ్లీ, లోక్‌సభ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ వేశారు. ప్రస్తుతం 11వసారి నామినేషన్ సమర్పించారు.

నామినేషన్ వేసిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి..



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రత కోసం బీజేపీని గెలిపించాలి

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



నేరేడుచర్ల: మాట్లాడుతున్న రాజాసింగ్, పక్కన సైదిరెడ్డి, సంకినేని వెంకటేశ్వర్‌రావు

నేరేడుచర్ల, మిర్యాలగూడ టౌన్, వేములపల్లి: దేశ భద్రత కోసం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. గురువారం నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డితో కలిసి నేరేడుచర్ల, వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో, మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుపొంది, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్యం, డబ్బులు వెదజల్లుతూ ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తోందన్నారు. శత్రు దేశాలు, ఉగ్రవాదులు బాంబుదాడులు చేస్తే ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పాకిస్తాన్ దేశానికి లవ్ లెటర్ రాసిందన్నారు. కానీ ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించి శత్రు దేశానికి వణుకు పుట్టించిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వారు డబ్బులు ఇస్తే తీసుకొని ఓటు మాత్రం కమలం పువ్వు గుర్తుకు వేయాలన్నారు. హుజూర్‌నగర్ ప్రాంత అభివృద్ధికి శానంపూడి సైదిరెడ్డి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో సనాతన ధర్మం వివక్షతకు గురైందని, బీజేపీ హయాంలో సనాతన ధర్మంతో పాటు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు తిరిగి జీవం పోసుకున్నాయన్నారు. ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ.. తాను హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోవడం ఖాయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్ రావు, పోరెడ్డి శ్రీలతారెడ్డి, పిల్లి రామారాజుయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, నరేష్, సత్యనారాయణరెడ్డి, విజయ్‌కుమార్, చింతకుంట్ల సోమిరెడ్డి, కొణతం నాగిరెడ్డి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, రేపాల పురుషోత్తం రెడ్డి గోగిరెడ్డి లచ్చిరెడ్డి, శ్రీలతారెడ్డి, కొండేటి సరిత, చిలుకూరి రమాదేవి, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, నాగిరెడ్డి, వేములపల్లి మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి, చల్లా సీతారాంరెడ్డి, సరిత, పెదమాం భరత్, వెంకన్న, ధూపాటి మట్టయ్య, జవ్వాజి సత్య నారాయణ తదితరులున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో పీఓ, ఏపీఓలదే కీలకపాత్ర



మాట్లాడుతున్న నోడల్ అధికారి

నల్లగొండ: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఉపఎన్నికను సక్రమంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ ఆఫీసర్(పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్(ఏపీఓ) కీలకపాత్ర అని ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించి 12 జిల్లాల మాస్టర్ ట్రైనర్లకు గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓటింగ్ విధానం, బ్యాలెట్ బాక్స్‌లను సీల్ చేయడం, బ్యాలెట్ పేపర్ అకౌంట్, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ మెటీరియల్స్‌ను ప్రిసైడింగ్ అధికారి ఎన్నికల నిబంధనల ప్రకారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఓలు, ఏపీఓలు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధిపై అవగాహన లేదు

- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్



మాట్లాడుతున్న గొంగిడి సునీత, పక్కన క్యామ మల్లేష్

ఆలేరురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధిపై అవగాహన లేదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ ఆరోపించారు. గురువారం ఆలేరు పట్టణంలోని రైల్వేగేటు వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో క్యామ మల్లేష్, గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ కలిసి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు కష్టాలు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ రాష్ట్రంలో సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూశారని, 24 గంటల కరెంట్ ఇచ్చి తెలంగాణను అన్నపూర్ణగా మార్చితే.. నాలుగు నెలల్లోనే పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చిందని దుయ్యబట్టారు. ఎంపీగా క్యామ మల్లేష్‌ను గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి హామీలను నెరవేర్చే శక్తి వస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పదవి చేపట్టిన నాటి నుంచే దోపిడీకి తెరలేపారని విమర్శించారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలన్నారు. దేవుడు పేరుతో బీజేపీ నాయకులు ఓట్లు అడుగుతున్నారని, దేవుడు వేరు రాజకీయాలు వేరు అనే విషయాన్ని ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, సూదగాని హరిశంకర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం, మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, మొరిగాడి వెంకటేష్, చింతకింది మురళి, పోరెడ్డి శ్రీనివాస్, బేతి రాములు తదితరులు పాల్గొన్నారు.

'భువనగిరి'లో పోలైన 10,761 పోస్టల్ ఓట్లు

భువనగిరిటౌన్: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో గురువారం 293మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారు. ఇప్పటి వరకు మొత్తం 10,761 మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఎన్నికల ముందు 48గంటల నిబంధన అమలు

- సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: జిల్లాలో లోక్ సభ ఎన్నికల సమయం సమీపిస్తున్నందున రానున్న 72గంటలు ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తామని, ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా 48 గంటల నిబంధనలు ఉంటాయని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. 48 గంటల నిబంధన మేరకు స్థానికేతరులు, ఓటర్లు కానీ వారు గ్రామాల్లో, వార్డుల్లో, కాలనీల్లో ఆశ్రయం తీసుకొని ఉండరాదని పేర్కొన్నారు. హోటల్స్, లాడ్జ్‌లలో కొత్త వ్యక్తులను ఉండనివ్వొద్దని కొత్త వ్యక్తులకు గ్రామాల్లో ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. 144సెక్షన్ అమలులో ఉంటుంది, సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదని చెప్పారు. ఐదు గురి కంటే ఎక్కువగా గుంపులుగా చేరవద్దు అని అన్నారు. ఇల్లు, ఇల్లు తిరిగి ప్రచారం చేయవద్దని, ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు సైతం మూసి వేయాలన్నారు. ప్రచారం ముగిశాక ఓటరు కానీ వారు నియోజకవర్గంలో ఉండవద్దని ఓటర్లను గుంపులుగా వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించడం నేరమని, పోలింగ్ కేంద్రాల వద్ద మొబైల్స్, వాటి టాకీలతో ప్రచారం చేయవద్దని పోలింగ్ బూత్ లోపల ఓటు వేసే ప్రక్రియను ఫొటోలు, తనిఖీలు నిర్వహిస్తూ గ్రామాలు, పట్టణాలు, వార్డ్స్‌లో నిశితమైన నిఘా ఉంచుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బందోబస్తుకు పోలీసులు సిద్ధంగా ఉండాలి



పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

- నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం: లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు పోలీసులు సిద్ధంగా ఉండాలని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి పేర్కొన్నారు. గురువారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో కేంద్ర పోలీస్ బలగాల అధికారులు, జిల్లా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు భద్రత పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ముందు, తర్వాత తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, పరిణామాలపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ రోజున 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇతర హానికర వస్తువులను తీసుకురాకుండా నియంత్రించాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి సంఘటన జరిగినా క్షణాల్లో రూట్ మొబైల్ టీమ్‌లు చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఐఆర్‌బీఎన్ కమాండెంట్ పేమ్ తుండిక్, అదనపు ఎస్పీ రాములునాయక్, డీటీసీ ఎస్పీ రమేష్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రమేష్, గిరిబాబు, రాజశేఖర్‌రాజు, సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ

పాలకవీడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన పాలకవీడు మండల కేంద్రం సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి జాన్ పహాడ్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి వెంట గల వ్యవసాయ విద్యుత్ 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అందులో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసమై ఉండటాన్ని రైతులు గుర్తించారు. వెంటనే విద్యుత్, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. కాగా.. మూడు రోజుల వ్యవధిలో మండల కేంద్రం సమీపంలో రెండు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను అపహరించుకుపోయారు.

పెరుగుతున్న మూసీ నీటిమట్టం



మూసీ రిజర్వాయర్

కేతేపల్లి: జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈఏడాది యాసంగిలో పంటల సాగుకు ఏప్రిల్ మొదటి వారంలో నీటి విడుదల నిలిపి వేసే నాటిని రిజర్వాయర్‌లో నీటి మట్టం 618 అడుగుల డెడ్ స్టోరేజీకి (గరిష్ట నీటిమట్టం 645 అడుగులు) పడిపోయింది. మూసీ ఎగువ, పరీవాహక ప్రాంతాల్లో అక్కడక్కడా కురుస్తున్న వర్షాలతో మూసీకి ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది. ఈక్రమంలో ప్రాజెక్టులో నీటిమట్టం నెల రోజుల వ్యవధిలో ఎనిమిది అడుగులు పెరిగి గురువారం సాయంత్రానికి 626.10 అడుగులకు చేరుకుంది. గురువారం మూసీకి ఎగువ నుంచి 372 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. 4.46 టీఎంసీల గరిష్ట నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.94 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలో యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తికి చెందిన జెర్రిపోతు రేణుక(22) డిగ్రీ పూర్తి చేసింది. బుధవారం మధ్యాహ్నం కిరాణా దుకాణానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో యువతి తండ్రి జెర్రిపోతుల యాదయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

నకిరేకల్ : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన నకిరేకల్ మండలం నోముల గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. నోముల గ్రామానికి చెందిన పోగుల పద్మ తన పాడిగేదెను ఊరు శివారులోని వ్యవసాయ పొలంలో మేత కోసం తోలుకెళ్లింది. గేదె మేసుకుంటూ వెళ్లి పొలంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభానికి తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

ఫెన్సింగ్ తొలగించారని పోలీసులకు ఫిర్యాదు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన అలుగుబెల్లి సైదిరెడ్డికి చెందిన వ్యవసాయ భూమిలో ఉన్న ఫెన్సింగ్‌ను అక్రమంగా తొలగించారంటూ బాధితుడు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తడకమళ్ల శివారులో సర్వే నంబర్ 718లో పట్టా భూమి ఉందని, ఈ వ్యవసాయ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఉండగా.. గ్రామానికి చెందిన కొందరు దానిని తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డిండి : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చింతపల్లి వాగు నుంచి మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక అంగడి బజార్‌లో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

జూన్‌లో ఊహించని రాజకీయ మార్పులు

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్



మాట్లాడుతున్న ఎంపీ కె.లక్ష్మణ్, పక్కన బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : జూన్ 4వ తేదీ తరువాత రాష్ట్రంలో ఎవరూ ఊహించని విధంగా రాజకీయ మార్పులు జరుగుతాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రక్తంలోనే కాంగ్రెస్ లేదని, ఏదో అదృష్టవశాత్తు సీఎం అయ్యారని తెలిపారు. కేసీఆర్ మీద ఉన్న వ్యతిరేకతతో అబద్ధపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు ఓటేశారని అన్నారు. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచింది తప్పితే.. ఎక్కడా రద్దు చేయలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు.. బీజేపీని ఓడించేందుకు ఏకమయ్యాయని, అయినా పట్టభద్రుల ఎమ్మెల్సీతో పాటు ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు సైదిరెడ్డి, బూర నర్సయ్యగౌడ్ గెలుపు ఖాయమన్నారు. మేధావులు, విజ్ఞులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, నిరుద్యోగులు బీజేపీకి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ఇతర నేతలు దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు, ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తున్నానని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, వర్షిత్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, కంకణాల నివేదిత, శ్రీదేవిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే..



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): జూన్ 4 తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఉండదని, మరో పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి, మాడ్గులపల్లిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తిప్పర్తి మండలంలో ఆరు వేల మెజార్టీ ఇచ్చినందుకు కృతజ్ఞుడనని తెలిపారు. ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ జరుగుందని చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జిల్లాలో దేవరకొండ, నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాలకు 4 లక్షల ఎకరాల సాగు నీరందించే ఎస్ఎల్‌బీసీ సొరంగం రూ. 2వేల కోట్లతో 33 కిలో మీటర్లు పూర్తి చేశామన్నారు. మిగిలిపోయిన 10 కిలో మీటర్లు పూర్తి చేయకపోవడం వల్లే జిల్లాలో కరువు పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. సొరంగం పూర్తి చేయించి తిప్పర్తి మండలంలో ప్రతి ఎకరాకు నీరందిస్తానన్నారు. ఆగస్టు వరకు బ్రాహ్మణ వెల్లెంల మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. రూ. 1500 కోట్లతో నల్లగొండ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. తిప్పర్తి మండలంలో ఊరికి 500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని చెప్పారు. ఎన్నికల్లో మండలం నుంచి కాంగ్రెస్ పార్టీకి 10 వేల మెజార్టీ రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుత్తా అమిత్‌రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, నాగులంచ విజయలక్ష్మీ, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

హోంగార్డులా వ్యవహరిస్తున్న అమిత్‌షా



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

- భువనగిరి సభలో అన్ని అబద్ధాలే మాట్లాడారు
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట: కేంద్ర హోం మంత్రి అమిత్ షా హోం గార్డులా వ్యవహరిస్తున్నారని, భువనగిరిలో నిర్వహించిన బీజేపీ సభలో అన్ని అబద్ధాలే మాట్లాడారని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తుందన్నారు. సభలో భువనగిరి పార్లమెంట్‌ను ఏ విధంగా అభివృద్ధి చేస్తారో చెప్పలేదన్నారు. పదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి వెనుకబడిందని, బీజేపీ, బీఆర్ఎస్‌లు తెలంగాణను ఆగం చేశాయని విమర్శించారు. నరేంద్ర మోదీ, అమిత్‌షాలకు గుజరాత్ రాష్ట్రమే ముఖ్యమా అని, తెలంగాణ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పుల పాలు కావడానికి ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ సీఎం కేసీఆర్ కారణమన్నారు. భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ ఇంకా బీఆర్ఎస్ నాయకుడిలాగే మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీజేపీలో మంచి నాయకుడు లేకనే పక్క పార్టీలో నుంచి వచ్చిన బూర నర్సయ్యకు టిక్కెట్ ఇచ్చారన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న తనకు కాంగ్రెస్ అధిష్టానం టిక్కెట్ ఇచ్చిందని పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఎంపీపీ చీర శ్రీశైలం, మండల అధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, నాయకులు దుంబాల వెంకట్‌రెడ్డి, ఇంజ నరేష్ తదితరులున్నారు.

మోదీ సర్కార్ కుట్రలను తిప్పికొట్టాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి



మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

భువనగిరిటౌన్ : మోదీ సర్కార్ విద్యను కాషాయీకరణం చేసేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి పిలుపునిచ్చారు. గురువారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో జరిగిన ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక్క నవోదయ పాఠశాల కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరచడమే కాకుండా, నిరుద్యోగాన్ని పెంచిందని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, లౌకిక రాజ్యాంగ హక్కులు, సామాజిక న్యాయం కోసం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనం రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, జిల్లా అధ్యక్షుడు చింతల శివ, సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్‌కు టికెట్ కేటాయించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

- భూకబ్జా కేసులున్న కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన సీఎం
- కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

మోటకొండూర్: బీఆర్ఎస్ పార్టీ బడుగు బలహీన వర్గాల అభ్యర్థిగా తనకు అవకాశం ఇస్తే.. కాంగ్రెస్ పార్టీ బ్రోకర్‌కు టికెట్ కేటాయిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ ఆరోపించారు. గురువారం మోటకొండూర్ మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేసిందని, అనేక భూకబ్జా కేసులు కలిగిన వ్యక్తిని సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారని విమర్శించారు. ఎలాంటి పెట్టీ కేసు కూడా లేని పేద వర్గాల బిడ్డనైన తనకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రజల బాధలు తెలిసిన వ్యక్తిగా తనకు అవకాశం ఇస్తే సేవకుడిగా పని చేస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక కేసీఆర్ చేసిన మంచిని, అలవికాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ పని తీరును ఒక్కసారి పరిశీలించి ఓటు వేయాలన్నారు. ఈ ఎన్నికల్లో మతం పేరుతో వస్తున్న బీజేపీ దొంగహామీలకు, కాంగ్రెస్ మాటలకు ప్రజలు మళ్లీ మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ విప్ సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, సూదగాని హరిశంకర్‌గౌడ్, యుగేందర్‌రావు, లింగాల శ్రీకర్‌రెడ్డి, తోట్ల స్వామి యాదవ్, పల్లా వెంకట్‌రెడ్డి, బొట్ల యాదయ్య, అనురాధ, దూదిపాల రవీందర్‌రెడ్డి, ఎగ్గిడి కృష్ణ, అరవింద్, మంత్రి రాజు, మల్ల సిద్దులు, అమరేందర్‌రెడ్డి, రామదాసు, విజయ, శ్రీనివాస్‌రెడ్డి, పైళ్ల పాండురంగారెడ్డి, అంజిరెడ్డి, జివిలికపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యావంతులు, మేధావులు కాంగ్రెస్ పక్షాన నిలబడాలి



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు కాంగ్రెస్ పక్షాన నిలబడాలని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నల్లగొండలోని లయన్స్ క్లబ్ భవనంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే లోక్‌పాల్, సమాచార హక్కు, విద్యాహక్కు, గృహహింస చట్టం, పేదలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇలా అనేక సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాజంలో జరుగుతున్న అవినీతిని బయటకు తీసేందుకు ఆర్టీఐ కార్యకర్తలు నిత్యం కృషి చేయాలన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్లను కొద్ది రోజుల్లోనే నియమిస్తామని సీఎం పేర్కొనడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలో రాజకీయ నాయకులు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ పంచాయతీరాజ్ ఎంఏ కరీం, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కోటగిరి దైవాధీనం, గోనా రెడ్డి, వినోద్ రెడ్డి, ఖుర్షీద్ పాషా, ముకుంద రెడ్డి, సత్యనారాయణ, హేమలత, సైదులు, రామకృష్ణ, శ్రీనివాస్, లక్ష్మి విద్యాసాగర్, అశోక్ రెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం

- వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- బీజేపీ పాలనలో ఆర్థిక అసమానతలు పెరిగాయి
- రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్



మిర్యాలగూడలో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్



సూర్యాపేటలో నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

మిర్యాలగూడ అర్బన్, భానుపురి(సూర్యాపేట): నేడు దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయని, వాటిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ సంసిద్ధం కావాలని రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలో పౌర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'పదేళ్ల పాలన ప్రజా జీవితం-దేశ భవిష్యత్', సూర్యాపేటలో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం-రాజ్యాంగం' అనే అంశాలపై జరిగిన సెమినార్‌లలో ఆయన మాట్లాడారు. ఈ దేశం ఏ మతానికి చెందినది కాదు అందరిదని రాజ్యాంగం రచిస్తే.. దానికి తూట్లు పొడిచి హిందుదేశంగా చెప్పేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని, ఈ ఉన్మాదం, మతోన్మాదుల తిమ్మిరిని దించాల్సిందేనని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీకి మంత్రి పదవి లేదని, ఇదే ఆ పార్టీ కొత్త రాజ్యాంగం అని విమర్శించారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్ర స్థాయిలో పెరిగాయని, ప్రపంచంలోనే అధిక శాతం నిరుద్యోగులున్న దేశంగా భారత్ మారిందని అన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వాలు గుళ్లు కట్టి వారిలో హిందూమత భావజాలాన్ని నూరిపోసి ముస్లింలపై విష భావం ఏర్పడేలా చేస్తున్నాయని, మత విద్వేషాలు రెచ్చగొడుతూ తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్నాయని అన్నారు. దేశ రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించడం దారుణమన్నారు. నేటి పరిస్థితి దుస్థితికి రాజకీయ పార్టీలే కారణమన్నారు. ఎన్నికలు జరిగేటప్పుడు తమ సిద్ధాంతాలు వల్లె వేస్తుంటారు గానీ, ఆ తరువాత నిద్రావస్థలో ఉంటారని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చిన మొదట్లో తీసుకొచ్చిన స్టార్టప్ ఇండియా, ఖేల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి పథకాలు బాగానే ఉన్నాయని, ప్రస్తుతం షటప్ ఇండియా నడుస్తోందన్నారు. గత డెబ్బై సంవత్సరాలుగా ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు హిందూ తత్వ భావజాలాన్ని ప్రచారం చేసి ముస్లింలపై విషప్రచారం చేస్తున్నారని అన్నారు. దీనిని ఎదుర్కోవడానికి పౌర సమాజం చైతన్యవంతం కావాలని కోరారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అన్ని రంగాలను విధ్వంసం చేస్తూ ఆదానీ, అంబానీలకు దేశ ఆస్తులను కట్టబెట్టారని విమర్శించారు. మతతత్వ బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. మిర్యాలగూడలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ పౌర జేఏసీ నాయకులు రవిచంద్ర, డాక్టర్ ముడ్వా రామారావు, జాడి రాజు, ఉదయ్, కిరణ్, రామయ్య, సుదర్శన్ వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సూర్యాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో కుంచం చంద్రకాంత్, వీరేష్‌నాయక్, కుంట్ల ధర్మార్జున్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహ బంధం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి



శ్రీకాంత్, హరీష్‌చారి (ఫైల్)

చింతపల్లి: రోడ్డుప్రమాదం రూపంలో మృత్యువు ఇద్దరి స్నేహితులను బలిగొంది. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన వట్టికోటి శ్రీకాంత్(27), శ్రీరామదాసు హరీష్‌చారి(27), జావిద్, రాజు నలుగురు స్నేహితులు కలిసి బుధవారం సరదాగా వైజాగ్ కాలనీకి కారులో బయల్దేరారు. నేరెడుగొమ్ము మండలం గుర్రపుతండా మూలమలుపు వద్ద అతివేగంతో ఉన్న వీరి కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న వట్టికోటి శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా హరీష్‌చారికి తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. దీంతో ప్రాణ స్నేహితులైన ఇరువురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాంత్ తండ్రి యాదయ్య, హరీష్‌చారి తండ్రి శ్రీరామదాసు వెంకటేశ్వర్లు తమ కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటారనుకున్న సమయంలో ఇలా.. తమ కుమారుల మృతదేహాలకు తలకొరివి పెట్టాల్సి రావడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇదిలా ఉండగా.. హరీష్‌చారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లి తిరుగు ప్రయాణంలో కుర్మేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కొన్ని రోజులు కోమాలో ఉన్నాడు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన గీత కార్మికుడు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో గీతకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం సాయంత్రం ఆత్మకూర్ మండల పరిధిలోని పాతర్లపాడులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తండు కృష్ణయ్య రోజు మాదిరిగా తాటి చెట్టు ఎక్కేందుకు సాయంత్రం వెళ్లాడు. చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారింది. దీంతో కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

- గుత్తా, కోమటిరెడ్డి కలయిక



నల్లగొండలోని పోలీస్ ఆడిటోరియంలో ఓ కార్యక్రమానికి హాజరై ఆప్యాయంగా పలకరించుకుంటున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయొద్దని వినతి



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

నల్లగొండ రూరల్: ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయొద్దని కోరుతూ గురువారం ఐసీఈయూ (ఎంప్లాయీస్ యూనియన్) నాయకులు నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయకుండా కాపాడాలన్నారు. ప్రజలకు భరోసా, భద్రత కల్పించే ఎల్ఐసీని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వినతి అందజేసిన వారిలో యూనియన్ నాయకులు నవీన్‌దాస్, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రవీందర్, శ్రీనునాయక్, ప్రజ్ఞాపురం శివశంకర్, సైదులు తదితరులున్నారు.

అన్నా.. 'కారు' గుర్తుంచుకో

భువనగిరి: బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం రాత్రి భువనగిరి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపారులు, చిరు వ్యాపారులను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు కొల్పుల అమరేందర్, కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య, కిషన్, సుభాష్, జహంగీర్, నువ్వుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కారు గుర్తుకు ఓటు వేయాలని చిరు వ్యాపారిని అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ఒకరు మృతి



జగ్రు (ఫైల్)

కొండమల్లేపల్లి: గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో ఒకరు మృతి చెందిన ఘటన కొండమల్లేపల్లి మండల పరిధిలోని ఆంగోతుతండాలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. ఆంగోతు తండాకు చెందిన ఆంగోతు జగ్రు(50) బుధవారం రాత్రి తన ఇంటి ఎదుట మంచంపై నిద్రిస్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేయడంతో జగ్రు తలపగిలి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ధనుంజయ, ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు కేంద్ర బలగాలు గ్రామంలో పికెటింగ్ నిర్వహిస్తున్నాయి. ఇదిలా ఉంటే మృతుడి కుటుంబీకులు పలువురు అనుమానితుల పేర్లు చెప్పగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.